సిపిఎంకు మేయర్ ధన్యవాదాలు

ప్రజాశక్తి-నెల్లూరు :నగరం స్రవంతి జయంతి వర్ధన్ తనపై జరిగిన దాడిని ఖండిస్తూ తనకు మద్దతుగా నిలిచినటువంటి సిపిఎం నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం మేయర్ స్రవంతి జయవర్ధన్ దంపతులు బాలాజీనగర్ ప్రాంతంలోని సిపిఎం జిల్లా కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో చోటు చేసుకున్న సంఘటనను ఖండిస్తూ సిపిఎం నాయకత్వం తనకు అండగా నిలవడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. మోహన్ రావు, సిపిఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు,ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్ బీ, సీఐటీయూ నగర కార్యదర్శి జి. నాగేశ్వరావు, కులవివక్షత వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి ఆలూరి తిరిపాలు, ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి. శ్రీరాములు ఉన్నారు.

సిపిఎం నాయకులను కలిసిన మేయర్ స్రవంతి

నెల్లూరు నగరానికి రాష్ట్రంలోని ప్రత్యేక స్థానం ఉంది. రాష్ట్రంలో విశాఖ పట్నం తరువాత అంత వేగంగా అభివృద్ధి చెందుతోన్న నగరం నెల్లూరు...చుట్టుపక్కల భారీ పరిశ్రమలు రావడంతో నగర జనాభా, నగరీకరణ వేగంగా పెరుగుతోంది. నెల్లూరు కార్పొరేషన్ ఎంతో బాధ్యతగా, కార్పొరేటర్లు, అధికారులు పనిచేయాల్సి ఉంది. నగర ప్రజలు అనేక రకాల సమస్యలతో బాధపడుతుంటే పట్టడం లేదు. 54కు 54 కార్పొరేటర్లను వైసిపి చేతిలో పెట్టారు. జనం సమస్యలు వదిలేసి, తమ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారు. నూతన పాలకవర్గం వచ్చినప్పటి నుంచి కనీసం వీధిలైట్లు సరిగా ఇవ్వలేదు. కార్పొరేటర్లు సొంత డబ్బులు, వార్డుల్లో భిక్షమెత్తుకొని వీధి దీపాలు వెలిగించుకునే దీనస్థితిలో ఉన్నారు. జనం బాధలు, ఇబ్బందుల గురించి కౌన్సిల్‌లో మాట్లాడి పరిష్కరించాల్సిన కార్పొరేటర్లు నగర ప్రజలు సిగ్గుపడేలా వ్యవహరిస్తున్నారు.

వీధిలైట్లకు భిక్షమెత్తుతున్నారు..!

- ◆10 లక్షల మందికి ఒక్క పాగింగ్ మిషన్ లేదు..
- ◆దోమలను పెంచిపోషిస్తున్నారు
- ◆తాగునీటికి ఇబ్బందులు...
- ◆కాంట్రాక్టర్ల బిల్లుల కోసం కన్నీళ్లు
- ◆54మంది కార్పొరేటర్లకు పట్టని ప్రజా సమస్యలు
- ◆ఇదీ కార్పొరేషన్ దుస్థితి

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర రాజకీయ చరిత్రలో నెల్లూరు నగరానికి ఎంతో ప్రత్యేకత ఉంది. జిల్లాలోని వివిధ రాజకీయపార్టీల ముఖ్యనేతలు, ఇక్కడే ఉంటున్నారు. 1884లో నెల్లూరు మున్సిపాలిటీ ఏర్పాటు చేశారు. 2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నెల్లూరు నగరాన్ని కార్పొరేషన్‌గా మార్పు చేశారు. కృష్ణపట్నం పోర్టు, థర్మల్ ప్రాజెక్టులు, అంతర్జాతీయ, జాతీయ బ్రాండ్ల రాకతో నెల్లూరు వేగంగా అభివృద్ధి చెందుతోంది. అందుకు అనుగుణంగా రోడ్లు, డ్రెయినేజీ, లైటింగ్, మంచినీరు, పార్కులు, సుందరీకరణ జరగాల్సి ఉంది. 2014 టిడిపి అధికారంలో ఉన్నప్పుడు పి.నారాయణ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తరువాత స్వకార్యంతో 650 కిలో మీటర్ల రోడ్లు, 650 కిలో మీటర్ల తాగునీటి పైప్‌లు, 110 పార్కులు, వీధుల్లో ఎల్ఇడి బల్బులతో పాటు ప్రధాన కేంద్రాల్లో కొంత అభివృద్ధి జరిగింది. 2019లో వైసిపి అధికారంలోకి రాగానే రూ.580 కోట్లతో నిర్మాణం జరుగు తోన్న మంచినీటి పథకాన్ని పక్కనపెట్టారు. సుమారు 90 శాతం పనులు పూర్తికాగ అధికారపార్టీ నేతల నిర్ణయాలతో మూతపడపోయింది. ఆరోజు ఏర్పాటు చేసిన రోడ్లలో గుంతలు పడితే పూడ్చే పరిస్థితి కూడా కనిపించడం లేదు. అపోలో ఆసుపత్రి నుంచి జాతీయ రహదారి వరకు రోడ్లకు శంకుస్థాపన చేసినా పూర్తి చేయలేదు. ముత్తుకూరు బస్టాండ్ వద్ద ఫ్లైఓవర్ సాగు తూనే ఉంది. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదు. నగర అభివృద్ధి అస్తవ్యస్తంగా ఉంది.

వీధి లైట్లకు భిక్షమెత్తుతున్నారు..!

ప్రజలకు ఏదో చేస్తామని ఓట్లు వేయించుకున్న కార్పొరేటర్లు కనీసం వీధి లైట్లు వేయించుకునే పరిస్థితుల్లో కూడా లేరు. 2021 ఎన్నికల్లో వైసిపికి 54కి 54 స్థానాలు ప్రజలు కట్టబెట్టారు. అధికారంలో వైసిపి ఉన్నందున తమ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని నగర ప్రజలు భావించి ఆపార్టీకి గతంలో ఎవరికీ సాధ్యం కాని విజయాన్ని అందించారు. ప్రజల ఆశలు అడియాశలయ్యాయి. కార్పొరేటర్లు ఎన్నికైన అప్పటి నుంచి ఇప్పటి వరకు కేవలం పదో, ఇరవై లైట్లు మాత్రమే అందించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక్కో డివిజన్లో 600 నుంచి 700 విద్యుత్ స్తంభాలు ఉంటే ఒకటన్నర సంవత్సర కాలంలో కనీసం లైట్లు కూడా వేయలేకపోయారు. పొదలకూరు రోడ్డు ప్రాంతానికి చెందిన ఓ కార్పొరేటర్ ప్రజల ఇబ్బందులను చూడలేక, కార్పొరేషన్ అధికారులు లైట్లు కూడా ఇవ్వక. డివిజన్లోని దాతల వద్దకు వెళ్లి నగదు చందాలు చేసుకొని ఇటీవల 10 వీధిలైట్లు కొనుగోలు చేసి వేశారు. పడారుపల్లి, భక్తవత్సలనగర్ ప్రాంతంలో ప్రజలకు ముఖం చూపించలేక సొంత డబ్బులు పెట్టి ఎల్ఇడి బల్బులు కొని వేస్తున్నారు. మాగుంట లేఅవుట్ ప్రాంతంలో 650 స్తంభాలుంటే ఒకటన్నర సంవత్సర కాలంలో కేవలం 20 వీధిలైట్లు ఇచ్చారు. నగరం మొత్తం ఇదే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం నగర జనాభా 10 లక్షలకు చేరు కుంది. దోమల నివారణకు ప్రతి 15 రోజులకోసారి డివిజన్లో పాగింగ్ చేస్తారు. కేవలం ఒక్క మిషన్‌ఉంటే అది రిపేర్ అయినట్లు తెలుస్తోంది. డ్రెయినేజీ రోడ్లు, పూడికతీత చేయడం, రోడ్ల మరమ్మతులు ఇక చెప్పనవసరం లేదు. కార్పొ రేషన్లో అప్పులు చేసి పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లులరాక కంటతడి పెడుతు న్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టుకోక నానా అవస్థలు పడుతున్నారు. కొత్తగా ఏర్పాటైన నగర పాలక వర్గం చేసిన అభివృద్ధి వేళ్లమీద లెక్కించొచ్చు. ప్రజలు ఇలాంటి ఇబ్బందులు పడుతుంటే నెల్లూరు కార్పొరేటర్లు సమస్యలు కౌన్సిల్లో చర్చించి పరిష్కరించు కోవాలి. అలాంటి పనులు చేయ కుండా అందరూ వైసిపి కార్పొరేట ర్లు నాలుగు గ్రూపులుగా విడిపోయి, కార్పొరేషన్లో గిల్లికజ్జాలు [illegible] నేతల ప్రజల [illegible] రించ కుంటున్నారు. ఇలాంటి నేతలనా మనం ఎన్ను కుంది. అంటూ సిగ్గుపడ తున్నారు. 139 ఏళ్ల చరిత్ర కలిగిన కార్పొరేషన్ ప్రతిష్ఠ [illegible] లేకుండా, ఉన్న పక్షం జనం కోసం మాట్లాడ కుండా,ఉండడం చూసి జనం నిర్వీర్యపోతున్నారు..

ప్రజా సమస్యలు పట్టించుకోరా..!

మాదాల వెంకటేశ్వర్లు - మాజీ డిప్యూటీ మేయర్

నెల్లూరు కార్పొరేషన్‌కు ఎంతో చరిత్ర ఉంది. 139 సంవత్సరాల్లో మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లో ప్రజా ప్రతినిధుల, అధికారులు చేసిన కృషి ఫలితంగా నగరం ప్రస్తుతం ఇలా ఉంది. దీనిని మరింత అభివృద్ధి చేసుకోవాలి. గత ఎన్నికల్లో మొత్తం వైసిపి కార్పొరేటర్లు ఎన్నికయ్యారు. నగరం అభివృద్ధి చెందుతుందని ప్రజలు ఓట్లేశారు. ప్రజా సమస్యలు పట్టించుకోకుండా రాజకీయ కక్షలతో ప్రజల నమ్మకాన్ని వమ్ము చేస్తున్నారు. నూతన పాలక వర్గంలో జరిగిన అభివృద్ధి ఏమిటో కార్పొరేటర్లు ఒకసారి గుర్తించాలి. ఏం జరిగింది. ప్రజలకు మనం ఏమి చేస్తున్నామో చూడాలి.

మాట్లాడుతున్న రజకవృత్తిదారుల సంఘం నాయకులు

రజక కుటుంబాల్లోని యువతకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి-నెల్లూరు

రజక కుటుంబాల్లోని యువతీ యువకులకు ఉపాధి కల్పించాలని ఏపి రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.భాస్కరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నేరేళ్ల శ్రీనివాసుల అధ్యక్షతన జరిగింది.ఈసందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ఎం.భాస్కరయ్య మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రులు, పోలీసు శాఖలు, విద్యాసంస్థల్లో వృత్తి పనిని స్థానిక రజకవృత్తిదారులకే ఇవ్వాలన్నారు.వృత్తిలో అధునాతన యంత్రాలతో మోడరన్ దోబీఘాట్స్ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఇస్త్రీ చేస్తున్న రజకవృత్తిదారులకు 250యూనిట్లు ఉచిత కరెంటు ఇచ్చి రోల్ పోలీసులాంటి యంత్రాలు కొనుగోలు చేసేందుకు ప్రతి కుటుంబానికీ రూ.5లక్షలు ఆర్థిక సాయం అందజేయాలన్నారు. 50సంవత్సరాలు పూర్తయిన వృత్తిదారులకు పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.గడిచిన మూడున్నరేళ్ల కాలంలో రజకుల అభివృద్ధి శూన్యమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రజకుల సమస్యలు పరిష్కరించాలన్నారు. లేకపోతే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కటికాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వృత్తిదారుల పట్ల ఈప్రభుత్వానికి చిత్త శుద్ధిలేదన్నారు.ఇప్పటికైనా వృత్తులను కాపాడేందుకు వివిధ కార్పొరేషన్ల ద్వారా బిసిలకు కేటాయించని నిధులన్నీ వృత్తిదారుల అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు.లేదంటే రానున్న ఎన్నికల్లో ఈ పాలకులకు తగిన బుద్ధిచెప్పే విధంగా చైతన్యం కావాలని పిలుపునిచ్చారు. నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్, కోవూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో సదస్సులు జరపాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి రేకులగుంట అంకయ్య, ఉపాధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, బ్రహ్మదేవి వేదవతమ్మ, కోమటిగుంట్ల కృష్ణ, సహాయ కార్యదర్శి పందేటి సురేంద్ర, దేవరకొండ వెంకటేశ్వర్లు, రమణయ్య, మన్నూరు శివ, అంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన కార్పొరేటర్లను అరెస్టు చేయాలి

మేయర్, గిరిజన సంఘాలు డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు

నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో ఒక పథకం ప్రకారం తనపై దాడికి యత్నించిన కార్పొరేటర్లను తక్షణమే అరెస్ట్ చేయాలని మేయర్ స్రవంతి జయవర్ధన్, గిరిజన సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం మేయర్ తన సహచర కార్పొరేటర్లు మద్దతు తెలియజేస్తున్న గిరిజన సంఘాల ప్రతినిధులతో కలిసి ఎస్‌పి కార్యాలయం చేరుకున్నారు. వారిని తొలుత ఎస్‌పి కార్యాలయంలోకి వెళ్లకుండా పోలీసు సిబ్బంది అడ్డుకున్నారు. ఎస్‌పి కె.తిరుమలేశ్వరరెడ్డిని ఆయన ఛాంబర్‌లో మేయర్ తన సహచర కార్పొరేటర్లతో, గిరిజన సంఘాల నాయకులు నాయకులతో కలిసి తనపై జరిగిన దాడి ఘటనపై విచారించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మేయర్ సహచర మహిళా కార్పొరేటర్లు కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో జరిగిన సన్నివేశాలకు సంబంధించిన చిత్రాలను చేతపట్టుకొని మేయర్‌పై దాడికి ప్రయత్నించిన కార్పొరేటర్లను తక్షణమే అరెస్టు చేయాలని, కార్పొరేటర్లపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయాలంటూ నినాదాలు చేస్తూ ఎస్‌పి కార్యాలయం నుంచి బయటకు వచ్చారు. ఈ సందర్భంగా మేయర్, గిరిజన సంఘ నాయకులు మీడియాతో మాట్లాడారు. కేవలం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫోటో సాకుగా చెప్పి రాజకీయ కుట్ర పూరిత కోణంలో కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో మొయిళ్ల గౌరీ, బొబ్బల శ్రీనివాస్ యాదవ్, మూలె విజయభాస్కర్ తనను అడ్డుకున్నారు. గిరిజన మహిళను అని కూడా చూడకుండా దాడికి చేశారన్నారు. ఈ విషయాన్ని జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసీ పెంచలయ్య మాట్లాడుతూ ఒక గిరిజన మహిళపై జరిగిన దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడికి పాల్పడిన వారిపై వెంటనే అట్రాసిటీ కేసు నమోదు చేసి వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి బిసి సంఘం నాయకులు కప్పిర శ్రీనివాసులు , మహిళా నాయకురాలు కప్పిర రేవతి పాల్గొని మద్దతు తెలియజేశారు.

బస్ షెల్టర్లను వినియోగంలోకి తేవాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-నెల్లూరు

లక్షల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి కార్పొరేషన్ పరిధిలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏసి బస్‌షెల్టర్లను వినియోగంలోకి తీసుకురావాలని, ఎండల నేపథ్యంలో ప్రధాన కూడళ్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ నాయకులు కోరారు. మంగళవారం డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్పొరేషన్ మేనేజర్ వినయ్‌తుల్లాను కలిసి వినతిపత్రం అందజేశారు. డివైఎఫ్ఐ నగర కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో రూ. కోట్ల ప్రజాధనం ఖర్చు చేసి నిర్మించిన బస్సు షెల్టర్లు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. ఎండలు తీవ్రమైన నేపథ్యంలో నిలువ నీడ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నగరంలో ఉన్న ప్రధాన కూడలిలలో మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని కోరారు. నగర నాయకులు జగదీష్, బాబు ఫయాజ్, సుబ్బరాయుడు, కుమార్, బాలు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విఆర్ విద్యా సంస్థలను

కబ్జాదారుల నుంచి కాపాడాలి : ఎస్ఎఫ్ఐ

నెల్లూరు : నగరంలో గత వందేళ్ల చరిత్ర కలిగిన విఆర్ విద్యాసంస్థని ఆస్తి పై కొంతమంది కబ్జాదారుల కన్ను పడిందని వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక విఆర్‌సి సెంటర్‌లో విఆర్ కాలేజీ దగ్గర నిరసన, ధర్నా చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి శ్రీనివాసులు మాట్లాడారు. ఘన చరిత్ర కలిగిన విఆర్ విద్యా సంస్థల ఆస్తులను పరిరక్షించాలని జాయింట్ కలెక్టర్ కూర్మానాధ్‌కు కలిసి వినతి పత్రం అందించినా ఫలితం లేదన్నారు. విఆర్ ఆస్తిని కొంత మంది కబ్జాదారులు వి ఆర్, కాలేజీ గోడను పగలగొట్టి రేకుల షెడ్లు, సైకిల్ స్టాండ్లు ఏర్పాటు చేశారన్నారు. ఇంత జరుగుతున్న ప్రత్యేక అధికారిగా ఉన్న పట్టించు కోకపోవడం దారుణ మన్నారు. కబ్జాదారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. నగరంలో ఉన్న ఒకే ఒక్క ఎయిడెడ్ కళాశాలను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీ హర్ష, నాయకులు నెల్సా, వి.నరేంద్ర, సంతోష్, కుమార్, సిసింద్రీ బాబి, సుమన్, పి.కిరణ్ పాల్గొన్నారు.

వికలాంగుల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :వికలాంగ విద్యార్థుల అభ్యున్నతిపై ప్రభుత్వం ప్రత్యేక దష్టి సారిస్తోందని ప్రధానోపాధ్యాయులు ఎం.డి. రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనాల కోసం మంగళవారం ఎంపికలు జరిగాయి. ప్రత్యేక ఉపాధ్యాయులు రామచంద్రయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హెచ్. ఎం మాట్లడారు. ప్రత్యేక టీచర్ రామచంద్రయ్య మాట్లాడారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్కూటీలో మంటలు

పొదలకూరు :పట్టణంలోని సంగం రోడ్డు కూడలిలో మంగళవారం ఓ హోండా యాక్టివా వాహనం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వివరాల మేరకు పట్టణానికి చెందిన చిట్టేటి సునీల్ కుమార్ తన యువకుడు హోండా యాక్టివా స్కూటర్ పై సొంత పని నిమిత్తం సంగం రోడ్డు వైపు వెళుండగా అకస్మాత్తుగా వాహనంలోని మంటలు చెలరేగాయి.స్థానికుల సహాయంతో నీళ్లు, మట్టిని వేసి మంటలను ఆర్పివేశారు. ఈ సంఘటన స్థానికంగా కలకలం సష్టించింది.

పొదుపు సంఘాలపై చర్చ

పొదలకూరు :పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయం ఆవరణంలో ఉన్న వెలుగు కార్యాలయంలో మంగళవారం పొదుపు సంఘాల ఎంఎస్ఇసి (మండల సమాఖ్య ఎగ్జిక్యూటివ్ కమిటీ) సమావేశం జరిగింది. సంఘం బంధం అధ్యక్షురాలు మీనాకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు. సంఘబంధా పనితీరు, సేవింగ్స్, అప్పులు, కొత్త పొదుపు గ్రూపులు ఏర్పాటు చేయడం, మహిళా రైతు ఉత్పత్తి దారులను గుర్తించి ప్రోత్సాహించడం వంటి అంశాలపై చర్చించారు. ఇప్పటి వరకు పొదుపు గ్రూపుల్లో చేరని మహిళలను గుర్తించి వారిని పొదుపు గ్రూపుల్లో చేర్చడం చేర్చేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఏపీఎం రోజ్ మేరీ, సీసీ లు శారద, దయాకర్, పెంచలమ్మ, వెంకటేశ్వర్లు, రమణమ్మపాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి-నెల్లూరు : రాష్ట్రంలో అక్రమంగా, అన్యాయంగా ఉపాధ్యాయులను, అధికారులను ప్రభుత్వం సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో స్పాట్ కేంద్రాల ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ సిహెచ్ రమేష్ మాట్లాడారు. చిన్న చిన్న తప్పిదాలను బూతద్దంలో చూపిస్తూ ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం సరి కాదన్నారు. ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ ఎ.సురేంద్రరెడ్డి మాట్లాడారు. ఫ్యాప్టో బాధ్యులు సిహెచ్ హజరత్తు, ఎం.పిచ్చిబాబు, దశరథరాములు, పి.వేణుగోపాల్, ఎస్‌కె ఎం.రియాజ్, సుధాకర్, నరసారెడ్డి పాల్గొన్నారు.

ర్యాలీ ప్రారంభం

ప్రజాశక్తి -కందుకూరు : తాడేపల్లిలో ఉన్న సిఎం జగన్మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపేందుకు మంగళవారం ఇక్కడి నాయీబ్రాహ్మణులు తరలివెళ్లారు. కందుకూరు నుంచి బయలుదేరిన నాయిబ్రాహ్మణుల వాహనాలను ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర నాయి బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి వల్లూరు కోటేశ్వరరావు, గోనుగుంట వేణు, కరేటి సుబ్బారావు ఉన్నారు.

మేయర్‌పై కార్పొరేటర్ల దాడి హేయం

ఐద్వా, కెవిపిఎస్ ఖండన

నెల్లూరు : కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశాల్లో ప్రజా సమస్యలపై చర్చలు జరపాల్సిన స్వపక్ష కార్పొరేటర్లు గిరిజన మహిళా మేయర్‌పై ఓ పథకం ప్రకారం దాడికి పాల్పడటం హేయమైన చర్య అని ఐద్వా, కెవిపిఎస్ నేతలు విమర్శించారు. మంగళవారం నగరంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో ఐద్వా, కె.వి.పిఎస్ ప్రతినిధులు సంయుక్తంగా విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా కార్యదర్శి షేక్ మస్తాన్‌బి మాట్లాడుతూ నగర ప్రథమ పౌరురాలైన మేయర్ స్రవంతి జయవర్ధన్‌పై సహచర కార్పొరేటర్లు దాడికి పాల్పడటం సిగ్గుమాలిన చర్య అన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆలూరుతిరుపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై, గిరిజనులపై దాడులు పెరిగిపోయాయన్నారు. గిరిజన మేయర్‌పై దాడికి పాల్పడిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. ఐద్వా జిల్లా కమిటీ అధ్యక్షురాలు టి.శివకుమారి, కె.విపిఎస్ నాయకులు జనార్ధన్ పాల్గొన్నారు.

సిపిఐ ఖండన

కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో కార్పొరేటర్లు రాజ్యాంగ హక్కును కాలరాసే విధంగా వ్యవహరిస్తూ గిరిజన మహిళా మేయర్‌పై దాడికి పాల్పడటం అప్రజాస్వామ్యకమని,ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐ నేతలు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సిపిఐ కార్యాల యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ సిరాజ్, షాన్‌వాజ్‌లు మాట్లాడారు. నగర మేయర్ పొట్లూరి స్రవంతి పై దాడి చేయడం అమానుషమన్నారు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు అజీజ్ అహ్మద్, నాగేంద్ర, సిపిఐ నాయకులు గోపాల్, కిషోర్, బాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న , కెవిపిఎస్ నాయకులు

12 వేల మందికి కేన్సర్ చికిత్సలు

ప్రజాశక్తి-నెల్లూరు :నగరంలోని 'మెడికవర్' కేన్సర్ ఇనిస్టిట్యూట్ ఏర్పడిన రెండేళ్ల కాలంలో 12 వేల మందికి పైగా రోగులకు కేన్సర్ చికిత్స అందించినట్లు మెడికవర్ హాస్పిటల్స్ వైస్ ప్రెసిడెంట్ మహేశ్వర్ రెడ్డి, సెంటర్ హెడ్ డాక్టర్ గణేష్ తెలిపారు. మంగళవారం మెడికవర్ ఆసుపత్రిలో వైద్యులు, ఇతర విభాగ అధిపతులు హాస్పిటల్ లో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. వైద్యశాల నిర్వాహకులు మాట్లాడుతూ ప్రముఖ కార్డియాలజిస్ట్, సిఈఓ డాక్టర్ అనీల్ కష్ణారెడ్డి తన సొంత జిల్లా లో అత్యాధునిక సదుపాయాలతో మెడికవర్ హాస్పిటల్ తో పాటూ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ను కూడా ఏర్పాటు చేశారన్నారు. 24 గంటలూ వైద్య సేవలు అందించడంతో పాటూ అనుభవజ్ఞులైన వైద్య బందాన్ని అందుబాటులో ఉంచారన్నారు. క్యాన్సర్ వైద్య సేవల కోసం చెన్నై, హైదరాబాద్ వంటి మహా నగరాలకు వెళ్లనవసరం లేకుండా ఇక్కడే అత్యాధునిక పరికరాలతో చికిత్స అందిస్తున్నామని వివరించారు.సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ ముత్తు, డాక్టర్ అవినాష్, శ్రీవిద్య, రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ ఆర్. ప్రియ, డాక్టర్ నవీన్ రెడ్డి, మార్కెటింగ్ రీజనల్ హెడ్ ఉదయ్, సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి తోటలు పరిశీలన

ఉలవపాడు :మండలంలో సోమవారం కురిసిన అకాల వర్షం వల్ల మామిడి పంట నేల రాలింది. ఉద్యాన అధికారి బి జ్యోతి, వీరేపల్లి, చాగోళ్లు లోని మామిడి తోటలను సందర్శించారు. వివరాలు సేకరించారు. రాలిన కాయలు దెబ్బతినకుండా చూసుకోవాల్సిన రైతులకు సూచించారు. తెగుళ్ల నివారణకు సూచనలు చేశారు. వీరేపల్లి గ్రామ ఉద్యాన సహాయకురాలు కె చరిత, మామిడి రైతులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

ప్రజాశక్తి -కందుకూరు : అంకమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణం కోసం ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి ఆధ్వర్యంలో శరవేగంగా జరుగతోంది. భక్తులు తమ వంతు విరాళాలు అందజేస్తున్నారు.ఈ నేపథ్యంలో పట్టణంలోని ఒకటో వార్డుకు చెందిన డబ్బు గోట్టు మల్లికార్జున్ భార్య పద్మ గతంలో పునర్నిర్మాణం కోసం రూ.29,116లు అమ్మవారికి కానుకగా ఇచ్చారు. మళ్లీ డబ్బుగోట్టు దంపతులు ఆలయ పునర్నిర్మాణానికి రూ.21,116 కానుకగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఎనిమిరెడ్డి వెంకటరెడ్డికి అందజేశారు. నిర్మాణ కమిటీ సభ్యులు పిడికిటి వెంకటేశ్వర్లు, మాదాల మాల్యాద్రి పాల్గొన్నారు.

'నాడు -నేడు' పనుల పరిశీలన

నెల్లూరు : నగర పాలక సంస్థ పరిధిలోని వివిధ పాఠశాలల్లో జరుగుతున్న" నాడు–నేడు" అభివద్ధి పనులను కమిషనర్ వికాస్ మర్మత్ మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమములో భాగంగా నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి వెంకటేశ్వరపురం, భగత్ సింగ్ కాలనీ, కర్ణాలమిట్ట మున్సిపల్ పాఠశాలలు, ఫతేఖాన్ పేట ఉర్దూ పాఠశాలలో అదనపు నూతన నిర్మాణాల పురోగతి, మౌళిక వసతుల కల్పన అంశాలను అడిగి పరిశీలించారు. ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ సంపత్ కుమార్,ఈ.ఈ. చంద్రయ్య ఉన్నారు.

'కోవూరు' సంఘటనలపై ఎస్‌పికి ఫిర్యాదు

ప్రజాశక్తి-నెల్లూరు :కోవూరులో ప్రజలను, టిడిపి నాయకులను భయభ్రాంతులకు గురిచేయాలని వైసిపి నేతలు గందరగోళ పరిస్థితులును సృష్టిస్తున్నారని, ఎస్‌పి స్పందించి శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు కోరారు. లేదంటే టిడిపి ఆధ్వర్యంలో 'చలో కోవూరు' కార్యక్రమం చేపడతామని పేర్కొన్నారు. మంగళవారం గత వారం రోజులుగా కోవూరు నియోజకవర్గంలో నెలకొన్న సంఘటనలపై, జరుగుతున్న పరిణామాలపై నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, కోవూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోటంరెడ్డి శ్రీని వాసులురెడ్డి ఎస్‌పి కె.తిరుమలేశ్వరరెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. కృష్ణ చైతన్య, కరకట మల్లికార్జున, రావిళ్ళ వీరేంద్ర, కోటంరెడ్డి అమరేంద్ర రెడ్డి, మామిడాల్ల మధు ఉన్నారు.

ఇంటింటా చెత్త సేకరణ

నెల్లూరు : క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యాచరణలో భాగంగా నగర పాలక సంస్థ ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్న డోర్ టు డోర్ చెత్త సేకరణకు ప్రజలంతా సహకరించి, సేకరణ వాహనాలకు గహ వ్యర్థాలను అందించాలని కమిషనర్ వికాస్ మర్మత్ కోరారు. స్థానిక చిల్డ్రన్స్ పార్క్, కాంతమ్మ ఆశ్రమం, ఏ.సి నగర్ మెయిన్ రోడ్ మస్టర్ పాయింట్లను కమిషనర్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని శానిటేషన్ సిబ్బంది హాజరును పరిశీలించారు. ముందస్తు అనుమతులు లేకుండా విధులకు గైర్హాజరైన సిబ్బందికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.

షాదీమంజిల్ ప్రయివేటీకరణ సరికాదు

ప్రజాశక్తి-నెల్లూరు : స్థానిక కోటమిట్ట షాదీ మంజిల్ బుకింగ్ ఆన్లైన్ విధానంలోకి తీసుకురావాలి టిడిపి పార్లమెంట్ పార్టీ అధికార ప్రతినిధి, రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నగర కార్పొరేషన్ పరిధిలో ఉన్న కోటమిట్ట షాదీ మంజిల్ ప్రయివేటీకరణ వివాదంపై టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి జాఫర్ షరీఫ్ జిల్లా అధికార ప్రతినిధి సాబీర్ ఖాన్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు మైనుద్దీన్ మాట్లాడారు. హయాద్ బాబా ,అబ్దుల్ మస్తాన్ ,ఇక్బాల్ నౌషాద్ ,అస్లం సత్తార్, రబ్బాని పాల్గొన్నారు

ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి..

ప్రజాశక్తి -లింగసముద్రం : టిడిపి ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం మండలంలోని ఆర్.ఆర్ పాలెంలో మంగళవారం నిర్వహించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. బస్టాండ్ వద్ద టిడిపి జెండా ఎగరవేశారు.ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. మండల టిడిపి అధ్యక్షులు వేముల గోపాలరావు,గ్రామా పార్టీ అధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు,క్లస్టర్ ఇన్‌చార్జి బొల్లినేని నాగేశ్వరరావు,మైనార్టీ సెల్ అధ్యక్షులు నాయబ్ రసూల్,మండల ప్రధాన కార్యదర్శి పూరిమిట్ల మాల్యాద్రి,తెలుగు యువత అధ్యక్షులు అడపా రంగయ్య,టిడిపి నాయకలు కిలారి రామారావు,చొప్పర మురళి,కేతినేని మహేష్ ఉన్నారు. ఈ సందర్భంగా 24 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి.

'గడప గడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :గ్రామస్థాయిలో ప్రజలకు పరిపాలన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని మంత్రి కాకాణి గోవర్ధన రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పేడూరులో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు జరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలు మరే ఇతర రాష్ట్రాల్లో అమలు కావడం లేవన్నారు. కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, వైసీపీ అధికార ప్రతినిధి తలమంచి సురేంద్ర బాబు, తూపిలి ఉదయ్ భాస్కర్ రెడ్డి, జెడ్పిటిసి శేషమ్మ, ఎంపీడీవో కన్నం హేమలత, తాసిల్దార్ శివయ్య, వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దళితులకు సిఎం క్షమాపణలు చెప్పాలి : టిడిపి

ప్రజాశక్తి -కందుకూరు :రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత దళితులపై ప్రతిరోజు ఏదో ఒకమూలన దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, శిరోముండనాలు, దళిత మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నా ఉదాసీనంగా వ్యవహరిస్తున్న సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సోషల్ జస్టిస్ సలహాదారు జూపూడి ప్రభాకర్ దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని టిడిపి నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ ప్రభుత్వంలో దళజత సమాజానికి జరుగుతున్న అన్యా యాన్ని, అవమానాన్ని ఎదిరించలేని, ప్రశ్నించలేని మనిషి రూపంలో ఉన్న వ్యక్తి జూపూడి ప్రభాకర్ అని విమర్శించారు. తక్షణమే సోషల్ జస్టిస్ సలహాదారు పదవికి ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నెల్లూరు పార్లమెంటు యస్.సి సెల్ అధికార ప్రతినిధి అంగులూరి చిన్న కొండయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి లింగాబత్తిన మాల్యాద్రి, కందుకూరు పట్టణ యస్.సి సెల్ అధ్యక్షులు పులి నాగరాజు పాల్గొన్నారు.

'మామిడి'లో తెగుళ్ల నివారణకు సూచనలు

ప్రజాశక్తి -ఉలవపాడు : మండలంలోని చాగొల్లు సచివాలయంలో నెల్లూరు జిల్లా ఉద్యాన అధికారి సుబ్బారెడ్డి అధ్యక్షతన ప్రొఫెసర్ డాక్టర్ వి విజయభాస్కర్ మాట్లాడుతూ ఉలవపాడు మండల మామిడి రైతులకు మామిడి పంటలో పండు ఈగ నివారణ చర్యలు, టెంక పురుగు నివారణ చర్యలు నల్ల తామర నివారణ చర్యలను వివరించారు. చాగల్లు ,వీరేపల్లి , కె రాజుపాలెం, చాకిచెర్ల రైతులు పాల్గొన్నారు. మామిడి రైతులు ఆదివారం కురిసిన అకాల వర్షం వలన భీమవరం వీరేపల్లి రైతుల తోటలలో మామిడికాయలు అధికంగా రాలాయని నష్టపరిహారం ఇప్పించాలని రైతులు అధికారులను కోరారు. ఉలవపాడు ఉద్యాన అధికారి బి. జ్యోతి, చాగల్లు గ్రామ సర్పంచ్ లతా, చంద్రశేఖర్, వీరేపల్లి, చాకిచెర్ల, భీమవరం, కె రాజుపాలెం, గ్రామ ఉద్యాన సహాయకులు, ఎఫ్‌పిఒ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

వైసిపి ఇంటింటా ప్రచారం

ఉలవపాడు : 'మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం మండలంలోని కరేడు గ్రామ సచివాలయం 2 పరిధిలోని కరేడు, పెద్దపల్లి పాలెంలో ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి సూచనల మేరకు మా నమ్మకం నువ్వే జగనన్న ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. సచివాలయం కన్వీనర్ నాయుడు మాధవి, వార్డు సభ్యులు అంకయ్య ఉన్నారు.

మలేరియా నివారణపై అవగాహన

నెల్లూరు : ప్రపంచ మలేరియా దినోత్సవ సందర్భంగా మంగళవారం డిఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం నుంచి డిఎంఓ డాక్టర్ బిజిత ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ బ్రిజిత మాట్లాడారు. టిబి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పవిత్ర, డాక్టర్ ప్రమోద్, డాక్టర్ సునీల్, పీఎంపీ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ ఉన్నారు.

పొదలకూరు : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం పొదలకూరు మండల వైద్యాధికారి రమేష్ ఆధ్వర్యంలో రామ్ నగర్ సెంటర్ నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ రమేష్ మాట్లాడారు.. ప్రజలు మలేరియా బారిన పడకుండా వుండేందుకు దోమతెరలు వాడాలన్నారు. మలేరియా విభాగం సబ్ యూనిట్ అధికారి ఆంజనేయ వర్మ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆదిలక్ష్మి , ఆరోగ్య విస్తరణాధికారులు రవికుమార్, శ్రీనివాసులు, ఆరోగ్య పర్యవేక్షకులు రమణమ్మ, ఆరోగ్య సహాయకులు రాధా కుమారి సాని శివప్రసాద్, కామాక్షమ్మ ఉన్నారు.

కందుకూరు :పట్టణంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అర్బన్ పరిధిలోని తూర్పు వడ్డీ పాలెం, సంతోష్ నగర్ యుపిహెచ్‌సిలలో కందుకూరు డిప్యూటీ డిఎం, హెచ్ డాక్టర్ ఎం ప్రియంవద ఆధ్వర్యంలో అవగా హన ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ప్రియంవద మాట్లాడారు. గ్రామ వార్డు, సచివాలయం పరిధిలో దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ వైద్యాధికారులు డాక్టర్ పి. బ్యూలా గ్రీస్, పి. స్టెల్లా కారుణ్య, సబ్ యూనిట్ ఆఫీసర్ జి. వినయ్ చంద్, యంపిహెచ్ ఈఓ షేక్. ఆరిపుల్లా, హెల్త్ సూపర్వైజర్లు యం శ్రీనివాసరావు, కె పద్మావతి, ఎఎన్‌లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ స్కూల్‌కు స్థలం కేటాయింపు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మండలంలోని రామాపురంలో నూతన అంగన్‌వాడీ స్కూల్‌కు స్థలం కేటాయించినట్లు ఎంపిడిఒ సి.శ్రీనివాసులు తెలియజేశారు. గతంలో పలు కారణాల వల్ల స్థల కేటాయింపునకు సంబంధిత గ్రామస్తులు అంగీకరించక పోవడంతో మంగళవారం ఎంపిడిఒ, శ్రీనివాసులు, తహశీల్దారు లక్ష్మీ నరసింహ, షేక్ నజీర్ విద్యాశాఖ అధికారి, రెవెన్యూ అధికారితో కలిసి సదరు గ్రామంలో పర్యటించి సంబంధిత గ్రామస్తులతో సంప్రదింపులు జరిపి వారి సమ్మతితో సర్వే నెంబర్ 161లో 5సెంట్స్ స్థల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. త్వరలోనే ఐ.సి.డి.ఎస్ అధ్వర్యంలో రూ.20లక్షల వ్యయంతో నిర్మాణ పనులను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. కార్యక్రమంలో వి.ఆర్.ఒ. ప్రతాప్‌కుమార్, సి.డి.పి.ఒ. జైన్‌కుమారి, సూపర్‌వైజర్ నారాయణమ్మ పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండల కేంద్రమైన ఎఎస్‌పేటలోని జెడ్‌పి హైస్కూల్లో మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సమకాలిన అంశాలపై చర్చించడంతోపాటు ప్రస్తుతం ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర వాటిపై చర్చించుకున్నారు. అనంతరం 1998 డిఎస్‌సి అభ్యర్థుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆపస్ మండల ప్రధాన కార్యదర్శి సిహెచ్.శ్రీనివాసులు, అధ్యక్షులు టి.బాలాజీ, జడ్‌పిహెచ్‌ఎస్ శ్రీకొలను హెచ్‌ఎం పోతులూరయ్య, జెడ్‌పిహెచ్‌ఎస్ గుంపర్లపాడు హెచ్‌ఎం శ్రీధర్, జడ్‌పిహెచ్‌ఎస్ దూబగుంట హెచ్‌ఎం మధుసూదన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి రాఘవ రెడ్డి, డివిజన్ కార్యదర్శి సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టిన 1998 డిఎస్‌సి అభ్యర్థులను ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఆర్‌లో ఘనంగా అథ్లెటిక్ మీట్

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం కడనూతల గ్రామంలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అథ్లెటిక్ మీట్ ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పివిఎన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కావలి డిఎస్‌పి ఎం.వెంకటరమణ విచ్చేసి అథ్లెటిక్ మీట్‌ను ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎఒ ఆర్‌వి రమణారెడ్డి, అన్ని విభాగాలపతులు, తిప్ప ఇన్‌ఛార్జి ఎస్ఐ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దర్గాను దర్శించిన డిప్యూటీ కలెక్టర్

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండల కేంద్రమైన ఎఎస్‌పేట రహమతాబాద్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ స్వాముల వారి దర్గాను మంగళవారం నెల్లూరు ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎ.మహేష్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను దర్గా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఇఒ మహమ్మద్ హుస్సేన్ దర్గాలోకి ఆహ్వానించగా ఉప సజ్జాద జునేద్‌పాష ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. అంతకుముందు ఆయన హజరత్ అమ్మవార్ల సమాధులపై గలేపులు పూల చెద్దరులు ఎక్కించి దర్శించుకున్నారు. అనంతరం ఆయనకు దర్గా ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ గత 8 నెలల నుండి నెల్లూరు ట్రైనింగ్‌లో ఉన్నానని ఇటీవల ఆర్‌డిఒ ట్రైనింగ్ మేరకు ఆత్మకూరు కేటాయించడంతో ఈ ప్రసిద్ధిగాంచిన దర్గాను దర్శించుకోవడం జరిగిందన్నారు. ఆయనవెంట ఆత్మకూరు ఆర్ఐ పృథ్వీరాజ్, తదితరులు పాల్గొన్నారు.

మసీదుపల్లి మాన్యం పరిశీలన

ప్రజాశక్తి-ఉదయగిరి : జిల్లా వక్ఫ్‌బోర్డు పాలకవర్గం మండలంలోని మసీదుపల్లి వక్ఫ్‌బోర్డుకు మసీదు మాన్యంను మంగళవారం సందర్శించి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ మసీదుపల్లి ఉదయగిరి మసీదుకు చెందిన వందల ఎకరాల మాన్యంనకు పరిరక్షించడానికి తగిన చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా వక్ఫ్‌బోర్డు పరిశీలనలోనికి వచ్చిందన్నారు. దీనికి సంబంధించిన నివేదికను రాష్ట్ర వక్ఫ్‌బోర్డుకు సమర్పించి వక్ఫ్‌బోర్డు ఆస్తులను అన్యాకాంతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ ప్రెసిడెంట్ షౌకత్‌అలీ, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్స్ గడియాల్ని ఎస్దాని, షేక్ సందాని కందుకూరు షాజహాన్ నెల్లూరు దస్తగిరి కావలి, మునీర్ కావలి ఉపసర్పంచ్ ముర్తుజా హుస్సేన్, తదితరులున్నారు.

సచివాలయంలో ఎంపిడిఒ పరిశీలన

ప్రజాశక్తి-ఉదయగిరి : మండల పరిధిలోని కొండయపాలెం సచివాలయంలో మంగళవారం ఎంపిడిఒ, హౌసింగ్ ఎఇ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు ఫ్లాట్‌లను పరిశీలన చేసి ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు తగిన సూచనలు చేశారు. అనంతరం కొండయపాలెం సచివాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. త్వరగా నిర్మాణ పనులను చేపట్టేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. సచివాలయం సిబ్బంది బయోమెట్రిక్ హాజరు 100శాతం ఉండాలన్నారు. సిబ్బంది విధులలో నిర్లక్ష్యంగా ఉండకూడదన్నారు. సచివాలయాలలో అందుబాటులో ఉండి యూనిఫారం వేసుకొని విధులకు రావాలని లేకపోతే తగిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ రామకృష్ణ, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ హర్ష, మండల కో ఆర్డినేటర్ ఇమ్రాన్, పంచాయతీ కార్యదర్శి నాగూర్ బీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి నాయకులకు శిక్షణ

ప్రజాశక్తి-కావలి : కావలి నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో మంగళవారం కావలి పట్టణ, బోగోలు, అల్లూరు మండలాల క్లస్టర్ ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జులు, బూత్ కన్వీనర్లతో ఐటిడిపి ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ డిజిటల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు హాజరయ్యారు. నెల్లూరు పార్లమెంట్ ఆర్.టి.ఎస్ ట్రైనర్ గొట్టిపాటి మనోరమ, పార్లమెంట్ ఐటిడిపి కోఆర్డినేటర్ షేక్.రసూల్, కావలి నియోజకవర్గ ఆర్.టి.ఎస్ ట్రైనర్ తుమ్మల హరీష్, హౌస్ మ్యానేజ్ కోఆర్డినేటర్ కార్తీక్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర, బోగోలు మండల పార్టీ అధ్యక్షులు మాలేపాటి వెంకటేశ్వర్లు నాయుడు, అల్లూరు మండల పార్టీ అధ్యక్షులు బండి శ్రీనివాసులు, పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు గుత్తి కొండకిషోర్‌బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబు రావు, క్లస్టర్ యూనిట్, బూత్ కమిటీ ఆర్.టి.ఎస్, మన టిడిపి యాప్ నిర్వహణ, హౌస్ మ్యానేజ్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాలేపాటి పరామర్శ

ప్రజాశక్తి-కావలి : కావలి రూరల్ మండలం తుమ్మలపెంట పంచాయతీ చినరాముడుపాలెం గ్రామస్తులైన కోదారు కుమార్ నివాసంలో పిడుగుపాటు కారణంగా ఇంటిలోని టీవీ, ఫ్రిడ్జ్, మిగిలిన గృహోపకరణ వస్తువులు అన్ని కాలిపోయి తీవ్రంగా నష్టపోయారు. వీరి కుటుంబాన్ని సోమవారం కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు వారి నివాసానికి వెళ్లి అందరిని పరామర్శించారు. కావలి రూరల్ మండలం టిడిపి అధ్యక్షులు ఉప్పల పార్టీ ముఖ్య నాయకులు సోమయ్యగారి రమణ, మస్తాన్, వాయల కనకయ్య, మామిడి తిరుపతి, మెట్ల సురేష్ గౌడ్, తిరుపతి వెంకయ్య, రామారావు, ఆదయ్య, మామిళ్ల బాబు, సుబ్బారాయుడు, పార్థయ్య, వెంకటేశ్వర్లు, తదితరులున్నారు.

కాన్ఫరెన్స్‌లతో కాలం సాగదీయడం అన్యాయం

ప్రజాశక్తి-కావలి : జిల్లా అధికార యంత్రాంగం జిల్లా కూడా వీడియో కాన్ఫరెన్స్ పేరుతో కాలం వెళ్లబుచ్చుతూ అన్యాయమని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు మల్లి పేర్కొన్నారు. మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లి మాట్లాడుతూ జిల్లా అధికారులందరూ కూడా ఉదయం 9 గంటల నుండి కాన్ఫరెన్స్ 11 గంటలకి సెట్ కాన్ఫరెన్స్, రెండు గంటలు నుండి కలెక్టర్ కాన్ఫరెన్స్, నాలుగు నుంచి సాయంత్రం 5 దాకా జాయింట్ కలెక్టర్ కాన్ఫరెన్స్, ఈ విధంగా ప్రతినిత్యం కాన్ఫరెన్స్‌ల పేరుతో కాలం సాగదీయడం అన్యాయమని తెలియజేశారు. సమస్యలతో కార్యాలయానికి వచ్చే ప్రజలు ఎదురుచూపులు తప్పడం లేదని తెలియజేశారు. ఈ విషయంపై జగనన్నకి ఉత్తరం రాస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో జబ్బ వాసు, జరుగుమల్లి వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

27న సంజీవని ఆరోగ్యరథం ప్రారంభం

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని యర్రంరెడ్డిపల్లెలో 27న ఆరోగ్య సంజీవని ప్రారంభిస్తున్నట్లు కాకర్ల ట్రస్ట్ చారిటి అధినేత కాకర్ల సురేష్ సోమవారం తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో ప్రతి పల్లెకు వచ్చి ఉచితముగా వైద్య పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. పేద ప్రజలకు ఈ ఆరోగ్య సంజీవని బస్సు ఎంతగానో ఉపయోగపడుతుందని అనారోగ్యంగా ఉన్న ప్రతిఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సూసైడ్ కారణాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

అంగన్‌వాడీ కార్యకర్త నికిత సూసైడ్‌పై విచారణ చేపట్టి నిశితంగా వాటి కారణాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ సీతారాంపురం మండలం సీతారాంపురం హరిజనవాడ అంగన్‌వాడీ కార్యకర్త పి.నీకిత వేధింపులకు తట్టుకోలేక ఆత్మహత్య ప్రయత్నం చేసిన ఘటన విధితమేనని, అంగన్‌వాడీ నాయకులు కార్యకర్తలతో ఆమెను స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో పరామర్శించామన్నారు. నికిత యాక్టింగ్ సూపర్‌వైజర్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి పథకం ప్రకారం ఆమెపై దాడి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయంపై జిల్లా నాయకత్వానికి స్థానిక నాయకులకు వివరించిందని సిఐటియు అండగా ఉంటుందని హామీ ఇచ్చామని, ఇంతలో ఇలా జరగడం బాధాకరమన్నారు. విధి

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శిస్తున్న అజయ్‌కుమార్

నిర్వహణలో అలసత్వం వహిస్తే సంబంధిత శాఖ ఉన్నత అధికారులు రికార్డులను పరిశీలించి తేడా ఉంటే నోటీసు పంపించి శాఖా పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. తోటి సూపర్వైజర్‌పై మరో ఇద్దరు సూపర్వైజర్‌లను తనిఖీకి పంపించడం ఎంతవరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. అనంతరం మరోమారు విలేకరులతో కలిసి వచ్చి తనిఖీ చేయడం దారుణమని ఆయన నికిత అవినీతికి పాల్పడుతుందని నిరూపించగలిగే సాక్షాలు సంపాదించారని ఆయన సిఐటియు తరపున ప్రశ్నిస్తున్నానన్నారు. దురదృష్టవశాత్తు ఆమె మరణించి ఉంటే కుటుంబ పరిస్థితి ఏమిటి అని ప్రశ్నించారు. అధికారుల వేధింపుల ఎక్కువ అయ్యాయని జర్నలిస్టుల సోదరులకు ఒక వార్త ప్రచురించేటప్పుడు ఆధారాలతో ప్రచురించాలని ఆయన కోరారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారని, మెరుగైన వైద్యం కోసం అవసరమైతే నెల్లూరుకి తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగు న్యాయం చేయకపోతే ఈ అటెండ్ సూసైడ్‌ను సుమోటోగా తీసుకొని ప్రయివేట్ కేసు వేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం స్థానిక సిడిపిఒ కార్యాలయంలో సిడిపిఒను కలిసి నికితపై జరిగిన వేధింపులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సిఐటియు తరపున కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా సిఐటియు సభ్యులు గడ్డం నాగేశ్వరరావు, సిఐటియు నాయకులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య అంగన్‌వాడీ వర్కర్ అండ్ వెల్ఫేర్ యూనియన్ నాయకులు మహాలక్ష్మి, రజియా, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బిజెపిని ఓడించి దేశాన్ని కాపాడుకుందాం..

- ప్రచారభేరి కార్యక్రమంలో నాయకులు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాళెం

ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బీజేపీని సాగనంపి దేశాన్ని కాపాడుకుందాం అని సిఐటియు మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున పిలుపునిచ్చారు. ప్రచార భేరిలో భాగంగా మూడవరోజు రేబాల, నాగమాంబాపురం, విలియమ్స్ పేట, వడ్డిపాలెం, కొండూరు పాలెం, ఇసుక పాలెం, పల్లాపల్లి, అంబేద్కర్ నగర్, బుచ్చిరెడ్డిపాళెం పట్నంలో పలు ప్రాంతాలతో పాటు చెల్లాయ పాలెం, అమ్మవారితోపు, ప్రగతి నగర్ కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేధావులు మహామహులు తయారుచేసిన రాజ్యాంగాన్ని అధికారంలోని బిజెపి ప్రభుత్వం పక్కనపెట్టి తమ సొంత మనువాద చట్టాన్ని ప్రజలపై రుద్ది ఎందుకో దుర్మార్గంగా ప్రయత్నిస్తుందన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం తీవ్ర ప్రమాదంలో పడిందని పేర్కొన్నారు. గడచిన 9 సంవత్సరాలు కాలంలో నిత్యావసర ధరలు చుక్కలు నడుపుతున్నాయని గ్యాస్, పెట్రోలు ధరలు అందుబాటు కాకుండా ఉన్నాయన్నారు. ఈ బీజేపీ ప్రభుత్వాన్ని

సాగనంపి దేశాన్ని కాపాడాలంటూ 30వ వరకు జిల్లా వ్యాప్తంగా ప్రచారం నిర్వహించి మే డే రోజు నెల్లూరు పట్టణంలో భారీ బహిరంగ సభ, ప్రదర్శన ఉంటాయని తెలిపారు. ఈ బహిరంగ సభకి ప్రదర్శనలకు జిల్లాలోని ప్రజలు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు, రైతుసంఘం అధ్యక్షులు మల్లికార్జున, కౌలురైతు సంఘం గరికిపాటి సురేష్, ప్రజానాట్యమండలి మండల కార్యదర్శి విస్సా మునిస్వామి, బుచ్చి పట్టణ కార్యదర్శి పోతంశెట్టి శ్రీనివాసులు, నాయకులు రేకుల గుంట అంకయ్య, షేక్ జానీ బాషా, ఖాదర్ బాషా, జానకి రామయ్య, రమణయ్య, వెంకటేశ్వర్లు, బుజ్జయ్య, సిఐటియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్ కుమార్

ప్రజాశక్తి-వరికుంటపాడు

శ్రమకు తగ్గ వేతనం అందించినప్పుడే సమాజంలో సమన్వయం ఉంటుందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, ఆశ వర్కర్లకు సకాలంలో జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వచ్చే జీతాలకు పెరిగిన నిత్యావసర ధరలకు వందన లేకుండా ఉండడంతో వారి బతుకులు చితికిపోతున్నాయన్నారు. ఇప్పటికైనా వారికి రూ.26వేలు వేతనాలు చెల్లించి వారికి అండగా నిలవాలని ఆయన కోరారు. అనంతరం ఇటీవల అత్యాచారయత్నానికి గురైన బాధిత ఆశ వర్కర్‌ను పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఎటువంటి సమస్య వచ్చినా పార్టీ అన్నివిధాల అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు డివిజన్ నాయకులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య, మండల నాయకులు మట్టే హరినారాయణ, కంచర్ల వెంకటేశ్వర్లు, శేషయ్య మండల అంగన్‌వాడీ అధ్యక్షురాలు రజియబేగం, స్కూల్ స్వీపర్ అధ్యక్షులు యేసయ్య, ఆశా వర్కర్ల యూనియన్ అధ్యక్షులు వజ్రమ్మ, కరెంటు యూనియన్ అధ్యక్షులు రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కో-ఆపరేటివ్ సొసైటీలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు సిండికేట్ ఫార్మర్స్ కో-ఆపరేటివ్ సొసైటీలో జిల్లా కో ఆపరేటివ్ ఆఫీసర్ సుధా భారతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా సొసైటీ సిబ్బంది పనితీరును, సంఘ క్యాష్ బ్యాలెన్స్, లోన్స్ రిజిస్టర్, స్టాక్ వెరిఫికేషన్ ఇతర రికార్డులను పరిశీలించి సంఘం పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా సొసైటీ బిజినెస్‌ను పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచనలు ఇచ్చారు. సొసైటీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్ రెడ్డి, డిసిఒను ప్యాడి ప్రోక్యుర్మెంట్‌కు సంబంధించి రావాల్సిన కమిషన్ సివిల్ సప్లయిస్ వారివద్ద నుండి త్వరగా వచ్చే విధంగా చూడాలని, రైతులకు ఎరువులు సరఫరా చేయుటకు గోడౌన్‌ను నిర్మించడానికి మహిమలూరు గ్రామంలో స్థలం కేటాయించాలని కోరారు. 2022-23 సంవత్సరానికి గానూ సంఘం రైతులకు రూ.2.95కోట్లు వ్యవసాయ రుణాలు, మధ్యకాలిక వ్యవసాయేతర రుణాలు రూ.2 కోట్లు, బంగారు ఆభరణాలపై రూ.2.20 కోట్లు, ఇతరాలు రూ.0.50కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. సొసైటీ ఆర్థిక సంవత్సరం 2022-23కు ఎరువులు వ్యాపారం 2.80 కోట్లు చేశారని సంఘం మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసన్ తెలిపారు. ఆత్మకూరు సబ్ డివిజనల్ కోఆపరేటివ్ సిబ్బంది సుధాకర్, మల్లికార్జున, ఫాతిమాబేగం పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

ఆటో కార్మికుల క్రమశిక్షణతో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ వెంకటరాజేష్ యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం నెల్లూరు జిల్లా ఆటో కార్మికు సంఘం ఆధ్వర్యంలో ఇందుకూరుపేట మండల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎస్ఐ వెంకట రాజేష్ మాట్లాడుతూ ఆటో కార్మికులు మద్యం సేవించి వాహనం నడప రాదనీ, ఇన్సూరెన్స్, బండి కాగితాలను ఎప్పటికప్పుడు జాగ్రత్తగా సరిచూసుకోవాలని తెలిపారు. కేవలం ఆటో విషయంలోనే కాకుండా ప్రతి ఆటో కార్మికుడు సామాజిక స్పృహ కలిగి బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు. అలాగే ప్రపంచ కార్మిక దినం మేడేను జయప్రదం చేయాలని జిల్లా ఆటో కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు టివివి ప్రసాద్, జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మారుబోయిన రాజాలు పిలుపునిచ్చారు. అదేవిధంగా 8గంటల పనిదినం సాధించుకునేందుకు కార్మిక వర్గం ఎన్నో బలిదానాలు చేసిందని అమెరికా లోనీ చికాగో నగరంలో జరిగిన ఉద్యమాలలో రక్త తర్పణాలతో ఎర్రజెండా ఆవిర్భవించిందని 8 గంటల పనిదినం సాధించుకున్నారని తెలియజేశారు. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న 44 లేబర్ చట్టాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రద్దు

మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటరాజేష్

చేసిందని కార్పొరేట్ పెట్టుబడీదారులకు కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్‌లను బిజెపి ప్రభుత్వం తీసుకురావడాన్ని కార్మిక వర్గం అంతా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సమ్మె చేసే హక్కు సంఘాన్ని ఏర్పాటు చేసుకునే హక్కు, వంటి అనేక కార్మిక వర్గం పోరాటాల ఫలితంగా సాధించుకున్నవని కార్మిక చట్టాలను రద్దు చేసిన బిజెపి ప్రభుత్వాన్ని 2024లో గద్దె దింపాలని పిలుపునిచ్చారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల సిపిఎం కార్యదర్శి మైపాటి కోటేశ్వరరావు, లీగల్ అడ్వైజర్ శ్యామ్ రెడ్డి, యువజన విభాగం నాయకులు చీమకుర్తి శ్రీనివాసుల రెడ్డి, వెన్ను వేణు, సిఐటియు నాయకులు నాసిన పరశురామయ్య, చాన్‌బాషా, మనోహర్, వాసు, దయాసాగర్, బ్రి ప్రసాద్, అశోక్, మస్తానయ్య, ప్రతాప్, ఆటో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు బిఎస్ఆర్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, పలువురు ప్రముఖుల హాజరు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

అందరివాడు, ప్రజావైద్యులు, మాజీ ఎంఎల్ఎ డాక్టర్ బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి కాంస్య విగ్రహం ఆవిష్కరణ బుధవారం సాయంత్రం 5 గంటలకు విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ జెడ్‌పి చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు హాజరై విగ్రహావిష్కరణ చేస్తారన్నారు. బిఎస్ఆర్ కాంస్య విగ్రహం ఏర్పాటు కోసం అన్ని పార్టీలు ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, మున్సిపల్ పాలకులు తదితరులు అందరిని సమిష్టి సహకారంతో మున్సిపల్ అనుమతి పొంది విగ్రహ ఏర్పాటుకు బి.ఎస్.ఆర్. సెంటర్‌లో స్థలం గుర్తించామన్నారు. డాక్టర్ సుందర రామిరెడ్డి ఆత్మకూరులో కొంతకాలం ప్రభుత్వ వైద్యాధికారిగా పనిచేసే అనంతరం ఆత్మకూరులో సొంతంగా బిఎస్ఆర్ హాస్పిటల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ ఆత్మకూరు పట్టణమే కాకుండా అటు ఉదయగిరి బద్వేల్ ప్రాంతాల్లో కూడా ఆయనకు అశేష అభిమానం పొంది ప్రజావైద్యుడిగా ప్రజల మన్ననలు పొందారని తెలియజేశారు. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి

ఏర్పాట్లు పరిశీలిస్తున్న బొమ్మిరెడ్డి

జనార్ధన్‌రెడ్డి ప్రోత్సాహంతో రాజకీయాల్లో ప్రవేశించి కొన్ని నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి జనతా పార్టీ అభ్యర్థి జిసి కొండయ్యపై విజయం సాధించి తొలిసారిగా శాసనసభ్యులుగా అయ్యారన్నారు. శాసనసభ్యులుగా ఉంటూనే ఆయన వైద్య సేవలు కొనసాగించారని తెలిపారు. ఆయన తుది శ్వాస వరకు ప్రజలకు వైద్యసేవలు అందించారన్నారు. ఆయన శాసనసభ్యునిగా ఎస్ఎఫ్‌సి చైర్మన్‌గా ఉన్న సమయంలో ఆత్మకూరు నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమం ఉద్యోగాలు కల్పనలు అనూహ్య ఫలితాలు సాధించి ప్రజాదరణ పొందారన్నారు. ఆయనవెంట సుందరరామిరెడ్డి మనవడు బొమ్మిరెడ్డి తారక్‌నాథ్ రెడ్డి, టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజ రెడ్డి, పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రా రెడ్డి, రూరల్ మండలం ప్రధాన కార్యదర్శి కేత విజయభాస్కర్ రెడ్డి, యువ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు తదితరులున్నారు.

యువజన విభాగం అధ్యక్షులుగా శ్రీనివాసులురెడ్డి ఎన్నిక

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

ఇందుకూరుపేట సిపిఎం యువజన విభాగ అధ్యక్షులుగా మైపాడు గ్రామానికి చెందిన చీమకుర్తి శ్రీనివాసులు రెడ్డి ఎన్నికయ్యారు. మంగళవారం జగదేవిపేట కళ్యాణ మండపంలో సిఐటియు, సిపిఎం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశం సందర్భంగా శ్రీనివాసులు రెడ్డిని యువజన విభాగం అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మైపాటి కోటేశ్వరరావు మాట్లాడుతూ సిపిఎం పార్టీలో యువతకి ప్రాధానమిస్తూ శ్రీనివాసుల రెడ్డిని ఎంపిక చేస్తామని, మరికొంత మంది యువకులకు అవకాశాలు కల్పించి మరిన్ని పదవులు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సిఐటియు గౌరవ అధ్యక్షులు టివివి ప్రసాద్, ఆటో యూనియన్ అధ్యక్షులు మారుబోయిన రాజా, శ్యామ్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు వెన్ను వేణు, కార్మికులు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంలో మత్స్యకారులకు పెద్దపీట

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో మత్స్యకారులకు పెద్దపీట వేస్తూ, వారి సంక్షేమానికి ప్రభుత్వం పాటిపడుతుందని ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కుడితిపాలెం గ్రామంలో ఫిషరీస్ కో-ఆపరేటివ్ సొసైటీ నూతన కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ సర్టిఫికెట్లు మత్స్యకారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుండి ఇబ్బంది పడుతున్న కుడితిపాలెం మత్స్యకారులకు మెరుగైన జీవనోపాధి కోసం ప్రభుత్వం అందిస్తున్న అన్ని పథకాలు వారికి చేరే విధంగా 169 మంది మత్స్యకారులతో ఫిషరీష్ కో-ఆపరేటివ్ సొసైటీని ఏర్పాటు చేసి సర్టిఫికెట్లు అందజేశామన్నారు. ప్రభుత్వం ద్వారా మత్స్యకారులకు సబ్సిడీపై బోట్లు, వలలు, టు వీలర్ లేదా త్రీ వీలర్, డీజిల్ సబ్సిడీ, మత్స్యకార భరోసాలాంటి ఎన్నో పథకాలు మత్స్యకారులకు వర్తింపజేస్తాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొండూరు అనిల్, వైసిపి మండల అధ్యక్షులు మావులూరు శ్రీనివాసులరెడ్డి, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ యాదవ్, యువనేత దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, జెడ్‌పి వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి, కుడితిపాలెం సర్పంచ్ నాయుడు సురేష్, నాయకులు, గ్రామస్తులు, అధికారులు పాల్గొన్నారు.

పోలంరెడ్డిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

దళిత నాయకుడు వీరి చలపతిరావును అవమానించిన టిడిపి కోవూరు ఇన్‌ఛార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇందుకూరుపేట దళిత సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి, ఎస్ఐ వెంకట రాజేష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దళిత నాయకుడు మధు మాట్లాడుతూ ఒక దళిత నాయకుడిని కుక్కతో పోల్చి, దళిత జాతి మొత్తాన్ని అవమానించిన పోలంరెడ్డి దినేష్ రెడ్డి వెంటనే దళితులందరికీ క్షమాపణ చెప్పాలన్నారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో మధు, సుకుమార్, వెంకటకృష్ణ వంశీ పాల్గొన్నారు.

తల్లీబిడ్డలను కలిపిన సింహాద్రిభవాని

ప్రజాశక్తి-బిట్రగుంట

భవాని ఎడ్యుకేషనల్ సొసైటి ఆదరణ కేంద్రం వ్యవస్థాపకులు సింహాద్రిభవాని ఆధ్వర్యంలో తల్లీబిడ్డలను కలిపిన అపూర్వ ఘటన మంగళవారం జరిగింది. మార్చి 30వ తేదీన బాపట్ల జిల్లా బొల్లాపల్లి వద్ద తప్పించుకున్న మాటలు రాని మూగ చెవుడు వున్న 70యేళ్ల వృద్ధురాలు కలిగిరి రోడ్డుపై తిరుగుతుండడంతో ఎస్ఐ సహాయంతో ఆదరణ కేంద్రం వ్యవస్థాపకులు సింహాద్రి రావు భవాని చేరదీసి హక్కున చేర్చుకొని ఆదరించారు. మాటలు రాని ఈ పెద్దమ్మ బాధను గమనించిన సింహాద్రిరావు ఆమె వివరాలను సోసల్ మీడియా ద్వారా తెలియజేశారు. అప్పటికే పలుచోట్ల విచారిస్తున్న ఆమె కుటుంబ సభ్యులు ఆదరణకేంద్రం డైరెక్టర్ సింహాద్రి రావును సంప్రదించి మంగళవారం ఆదరణ కేంద్రం వచ్చి పెద్దమ్మను చూసి ఇన్ని రోజులు కన్నతల్లిలా ఆదరించిన సింహాద్రి భవానిలను అభినందించారు. కార్యక్రమంలో వ్యవస్థాపక రాలు భవాని, పెద్దమ్మ మేనల్లుడు, శ్రీమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపు వద్దని నిరసన

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ పరిధిలోని ఇబ్రహీంపేటలో మద్యం షాపు ఏర్పాటును నిరసిస్తూ వివిధ ప్రజా సంఘాలకు చెందిన ప్రతినిధులు నిరసన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు షేక్ నూరుద్దీన్, జై భీమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, బత్తుల రవిచంద్ర, మానవ హక్కుల పరిరక్షణ సమితి ప్రకాశం జిల్లా అధ్యక్షుడు దాసరి సునీల్ మద్యంషాపు ఏర్పాటును తీవ్రస్థాయిలో తప్పుబట్టారు. మద్యం షాపు ఏర్పాటు చేసే ముందు పక్కనే ఉన్న ఐటిఐ కాలేజీ, దాని పక్కనే వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠం గుడి ఉన్నందున అక్కడికొచ్చే మహిళా భక్తులకు, కాలేజీ విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. ప్రజా సంఘాల నాయకులు, కె.శ్రీనివాసులు, అహమ్మద్, నవీద్, బొంత సుధీర్, తిరుపతి, సాగర్, పైడి ప్రసాద్, స్థానికులు పాల్గొన్నారు.

న్యాయమూర్తులకు వీడ్కోలు సభ

ప్రజాశక్తి-లీగల్ : 5వ అదనపు జిల్లా జడ్జీ ఎం.మాధురి, లోక్‌అదాలత్ సెక్రటరీ శ్రీనివాసులు నాయక్, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జీ ప్రసూన బదిలీ సందర్భంగా న్యాయవాదుల సమావేశ మందిరంలో మంగళవారం వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. 5వ అదనపు జిల్లా జడ్జీ మాట్లాడుతూ ఇక్కడ తాను పనిచేసిన అంతకాలం న్యాయవాదులు చక్కగా సహకరించారన్నారు. న్యాయ మూర్తులు, బార్ ప్రెసిడెంట్ ఉమామహేశ్వరరావు, సీనియర్ న్యాయవాది, బార్ కౌన్సిల్ మెంబర్ వేనా చంద్రశేఖర్ రెడ్డి, జూనియర్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

'హౌసింగ్' పథకంపై ఎంపిడిఒ సమీక్ష

ప్రజాశక్తి-సంగం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ గోపి హౌసింగ్ పథకంపై సచివాలయం సిబ్బంది వాలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వారికి అవగాహన కల్పించారు. ఇళ్ల నిర్మాణాల నాణ్యతలో రాజీ లేకుండా స్వయంగా లబ్ధిదారులే తమ ఇళ్లను పర్యవేక్షించే విధంగా చూడాలని వారికి సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ కరీముల్లా, పొదుపు ఎపిఎం విజయ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణ దినోత్సవం

ప్రజాశక్తి-సీతారామపురం : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మెడికల్ ఆఫీసర్ ఎం.రవికుమార్ ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్ర సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మలేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. దోమ పుట్టకూడదు.. దోమ కుట్టకూడదు.. అనే నినాదాన్ని వినిపిస్తూ ప్రతివారం ఫ్రైడే డ్రైడేను పాటించాలని కోరారు. దోమ తెరలు వాడాలని, ఇంటి లోపల, బయట నీరునిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్‌లు, ఎఎన్‌ఎంలు, ఎంపిహెచ్‌ఎలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎఎస్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సురేష్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పిహెచ్‌సి నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ సురేష్ మాట్లాడుతూ ప్రజలు మలేరియా బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచిం చారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దోమతెరలను వాడుకోవాలని తెలిపారు. అలాగే ఇంటి ఆవరణలో నీటి నిల్వ ఉంచకూడదని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. కార్యక్ర మంలో ఎంపిహెచ్ఇఒలు కాంతయ్య, ముజీబ్, సిహెచ్ఒ దేవసేన, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సంగం : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా సంగం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ప్రతిమ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. పిహెచ్‌సి నుండి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి దోమ పుట్ట కూడదు.. దోమ కుట్ట కూడదు.. అంటూ నినాదాలు చేశారు. ప్రజలు తమ ఇళ్ల పరిసర ప్రాంతాలలో దోమలు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా అధికారి ఖాదర్ బాషా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ గోపినాథ్ మాట్లాడుతూ సర్ రోనాల్డ్ రాస్ మొదటిసారిగా మలేరియా వ్యాధి దోమల వల్ల వ్యాప్తి చెందుతుందని కనుగొన్నారు. ఏప్రిల్ 25న జయంతి సందర్భంగా ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారన్నారు. మలేరియా ఒకప్పుడు సీజనల్ వ్యాధిగా ప్రచారంలో తీవ్ర జ్వరమని, కానీ వాతావరణ పరిస్థితులు గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ లోపం, వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో దోమలు అధికమై అవి కుట్టడం వల్ల మలేరియా వచ్చేదన్నారు. మలేరియా నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి దోమల నివారణకు సహకరిస్తే మలేరియాను పూర్తిగా నివారించవచ్చని వివరించారు. కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి కొండారెడ్డి సూపర్వైజర్లు ఖాజా మొహిద్దీన్, సైదా, నౌషాద్, భాషా, రోజల్లిన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మలేరియా వ్యాధి నివారణకు ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, తద్వారా దోమలను నివారించవచ్చని మహిమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి పి.అనూష కుమారి తెలిపారు. జాతీయ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి వైద్య సిబ్బంది వైద్యాధికారులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆరోగ్య కేంద్రాల నుండి సోమశిల రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మలేరియా వ్యాధి గురించి సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆస్మా, సబ్ యూనిట్ ఆఫీసర్ ఖాదర్ బాషా, డిపిఎంఒ నాగరాజు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సుగుణమ్మ, సూపర్‌వైజర్ రషీద్, హెల్త్ అసిస్టెంట్లు జిల్లాని భాషా, కృష్ణారెడ్డి, ఆనంద్, శ్రీరాములు, ఆశాలు పాల్గొన్నారు.